శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

గురోపినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:1 సంచిక:1 త్రైమాసిక పత్రిక డిసెంబరు 1997

సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!



ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన
హృదయ కుహరంలోని
నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి.
ప్రణవనాద వీచికల్లా
సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!

ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన
మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు
అంతటా నిరంతరం
వర్షించాలి! ఆ ప్రేమామృత
ధారలలో తడుస్తూ, ఆ
జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయ్! లేడోయ్!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

******************************************************************************************

ఈ సంచికలో


1. సాయివంటి దైవంబులేడోయ్!లేడోయి
2. ఉన్నమాట - అనుకున్నమాట - గురు బంధువులు
3. 1997 నాటి విజయదశమి ఉత్సవ విశేషాలు - గురు బంధువులు
4. గురు స్మృతులు -
   - గురు సన్నిధి — సి.హెచ్.లక్ష్మీనారాయణ
   - మన గురువు — సి.హెచ్.సాంబశివరావు
   - అనుభవంలోకి వచ్చిన నిజం — జి.సుజాత
   - గురుదేవుల పిలుపు అందినవేళ — వి. విజయలక్ష్మి
5. ది. ఫిబ్రవరి 1989 — 'సాయిపథం' నుండి దాసగణుకు బాబా శిక్ష(ణ)
6. నా దృష్టిలో గురువు — 'సాయిపథం' నుండి డా|| జి. సాయి వర ప్రసాదరావు
7. శ్రీ సాయి బాబా ఎవరు? — 'సాయిపథం' నుండి

## ఉన్నమాట - అనుకున్నమాట

"సద్గురువును నమ్ముకో - నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాడు" అని బాబా పలికిన పలుకులపై విశ్వాసంతో అనేకమంది గురుబంధువులు నేడు ఆ సాయికి ప్రతిరూపమైన శరద్బాబూజీని నమ్ముకొని, బ్రతుకు మీద విరక్తిని తొలగించుకొని, "శ్రద్ధ, సబూరీ"లను ఆశ్రయించి, అహంకారాన్ని నశింపజేసుకొని సద్గురు సేవలో తరిస్తున్నారు.

బాబా తనకప్పగించిన బాధ్యతను త్రికరణ శుద్ధిగా ఆచరించాలనే దృఢ సంకల్పంతో, బాబా ఆలోచనలతో తన వద్దకు వచ్చిన జన సందోహం సందేహాలకు సహేతుకమైన సమాధానాలిస్తూ, వారి మానసిక ఆందోళనలకు పరిష్కారాన్ని సూచిస్తూ డోలాయమాన మనస్కులకు స్థిరత్వాన్ని చేకూరుస్తూ ప్రశాంత జీవన గమనానికి మార్గదర్శకత్వం వహిస్తున్న శరద్బాబూజీ నేడెందరికో ఆప్తులకు - ఆత్మీయులకు - దేవగురుదేవుని వంటివారు మన గురుదేవులు. ఆ సద్గురుని సమక్షంలో, వారి వివిధ విషయ సమీక్షలలో చల్లని మాటను, చక్కని బాటను పొందగల్గిన అదృష్టవంతుల అనుభూతులను, అనుభవాలను దేశవ్యాప్తంగా వున్న గురుబంధువులందరికీ అందించాలనే ఆకాంక్షతోనే ఈ "గురుకృప" చిఱు పత్రికను "త్రైమాసిక" పత్రికగా వెలువరించే ప్రయత్నం ప్రారంభించాం.

అశేష గురుబంధువులు గురువుగారిని దర్శించిన సందర్భాలలో, వారి లీలలను అనుభవించిన సందర్భాలలో తమకు కలిగిన స్పందనలను, అభిప్రాయాలను ఈ "గురుకృప" పత్రిక ద్వారా తోటి గురుబంధువులెందరికో అందించేందుకు వీలుగా తమ రచనలను పంపవలసిందిగా సాదరంగా అభ్యర్థిస్తున్నాం. శరద్బాబూజీ మహిమాన్విత ప్రక్రియలను ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుభవించిన శిష్యుల ప్రవచన రచనలద్వారా గురుదేవుల ఆలోచనారీతి, ఏకేశ్వరోపాసనరీతి తెలుసుకోవటానికి ఈ "గురుకృప" పత్రిక ఒక సాధన, పరిశోధన కావాలని మా వాంఛ

ఈ పత్రికకు రథములు, రథ సారథులు ఉండరు. గురు దేవుల దీవెనలు, గురు బంధువుల ప్రేమ తత్వమే దీనికి అండదండలు. మనకై మనమే నడుపుకోవడం ఈ పత్రిక ప్రత్యేకత. గురుదేవుల అనుగ్రహం, వారి లీలా విశేష గ్రహణమే నిర్వాహకులకు, పాఠకులకు ప్రతిఫలం. పత్రికలో గల చిన్న - పెద్ద లోపాలను పాఠకులు సహృదయతతో సూచిస్తే సవరించుకుంటూ సవినయంగా ముందుకు నడుద్దాం. అసంఖ్యాకంగా గురుసన్నిధికి చేరుతున్న నూతన గురుబంధువుల కోసం సాయిపథం గత సంచికల నుండి కొన్ని అమూల్య ఆధ్యాత్మిక వ్యాసగుళికలను గురుకృప పత్రిక ద్వారా అందించాలనేదే మా ఆకాంక్ష.

గురుబంధువులు.

# 1997 నాటి విజయదశమి ఉత్సవ విశేషాలు

2-10-97 నుండి 11-1-97 వరకు విజయదశమి పర్వదినాలు. విజయదశమినాడే బాబా సమాధిరోజు. బాబా సమాధి పొందిన ఆ విజయదశమి పండుగరోజే మన శరద్బాబూజీ 43వ పుట్టినరోజు. శరద్బాబూజీ జన్మదిన సంబరాలను అతి ఆడంబరంగానూ కాక, అత్యంత నిరాడంబరంగానూ కాక అవసరాల మేరకు శ్రీ యస్.వి.ఎల్.నారాయణరావుగారి నేతృత్వంలో సర్వాంగ సుందరంగా షిరిడిలో నిర్వహింపబడ్డాయి. శ్రీ ఎస్.వి.ఎల్. నారాయణరావుగారు "సాయిపథం" నిర్వాహకులుగా, గురువుగారి అనుంగుశిష్యులుగా అందరికీ సుపరిచితులే. అన్నివేళలా గురుబంధువుల ఆప్తబంధువుగా వుంటూ, కలిగిన ప్రతి చిన్న అనుమానానికి పెద్ద మనసుతో సమాధానమిస్తూ, నిత్యం వచ్చే భావ బాధితులెందరినో గురువుగారి చెంతకు చేరుస్తూ అందరి శ్రేయోభిలాషిగా ఆదరింప బడుతున్న సమర్థత గలిగిన శిష్యులు వారు. ఆనాటి ఉత్సవాలలో వంట-వడ్డన పనులు, భోజన సదుపాయాలు, వసతి సౌకర్యాలు, డెకరేషన్ ఏర్పాట్లు మొదలైన పనులన్ని వివిధ శాఖలుగా విభజింపబడి, సమర్థులైన కార్యకర్తలను బాధ్యులుగా దించటం జరిగింది.

శ్రీ నారాయణరావు గారి మాటల్లో చెప్పాలంటే "ఈ సారి జరిగిన శరద్బాబూజీ జన్మదిన- విజయదశమి కార్యక్రమాలు ఏ ఒక్కరి ఆదేశం మేరకో, ఏ ఒక్కరి ఆధ్వర్యంలోనో కాక గురుబంధువులందరు సుహృద్భావ వాతావరణంలో, కుల మత, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా నిర్వహించబడ్డాయి. పలు ప్రాంతాలనుంచి వచ్చిన గురుబంధువులందరూ తమ తమ ప్రాంతాలను మరచి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పని, ఆ పని అని లేకుండా అన్ని పనులూ స్వయంగా, సమముగా నిర్వహించుకురావటం ఈ యేట ఉత్సవాలలోని విశిష్టత."

విజయదశమి ఒక్కరోజు మాత్రమే గురుదర్శనం లభిస్తుందన్న అభిప్రాయంతో దూరప్రాంతాలనుండి ఆనాటికి అక్కడికి చేరిన గురుబంధువుల సందోహం నిరుత్సాహ పడక తప్పలేదు -కారణం - 9వ తేదీ నుండే శరత్ బాబూజీ దర్శనం ఇవ్వటం ప్రారంభించారు.

ప్రతివారిలో అదృశ్యశక్తిగా నిబిడీకృతమై, గురుబంధువులకు శక్తిని, యుక్తిని, ధైర్యాన్ని ప్రసాదిస్తూ, కార్యక్రమాలన్నీ అప్రతిహతంగా పూర్తికావటానికి తోడ్పడింది "గురుదీవెనే" అని అందరి విశ్వాసం. "పర్సనల్ ఇంటర్వ్యూ"లను ఆశించినవారు ఇన్ని రోజులూ రెండుపూటలా గురుదర్శన భాగ్యం కలగటంతో పులకించిపోయారు. చివరికి గురుదేవుని విడిచిపోయే రోజు వచ్చేసరికి పెళ్ళిలోని అప్పగింతల వాతావరణం ఏర్పడించి. పొంగివచ్చేదుఃఖాన్ని దిగమింగుకొని, భారమనస్కులై తమపాదాల్ని "సాయిపథం' నుండి రైలు, బస్సుల వైపు మరలించక తప్పలేదు. ఈసారి గురుదర్శనం విజయదశమి తరువాత

రెండుపూటలా పొందటం ఊహించరాని అదృష్టం. 12వ తేదినుండి తిరుగు ప్రయాణం అవుతున్న ప్రతి గురుబంధువు గురువుగారి ఆశీర్వచనంతో ఆనంద హృదయులుగా గృహోన్ముఖులు అయినారు.

తెనాలి ప్రాంతవాసి గురుబంధువుల సహవాసి శ్రీకృష్ణ మాష్టారుగారి అధ్వర్యంలో విజయదశమి రోజు బాబా అఖండనామ సంకీర్తన మరచిపోలేని ఒక అనుభూతి.

అన్ని రోజులు తెనాలి, జాగర్లమూడి, విజయవాడ గురుబంధువులు ఉదయం టిఫిన్, రెండుపూటల భోజన వడ్డన కార్యక్రమాలను చాలా చక్కగా పర్యవేక్షించారు.

కృష్ణ మాష్టారుగారి విద్యార్థులు తెనాలిలో జరిగే అన్నదాన కార్యక్రమాలలో పొందిన తర్ఫీదుతో సేవాదృక్పథంతో భోజనం ముందు వడ్డన దగ్గర నుండి భోజనం అనంతరం విస్తళ్ళు తీసివేసే కార్యక్రమం వరకు ఓపికగా బాబా నామం, గురునామం చెప్పుకుంటు తమను మరచి సేవచేయటం భక్తులకు మహదానందం కలిగింది.

అలా వచ్చిన గురు బంధువులకు వడ్డన ఒక ఎత్తు అయితే, రోజు రోజుకూ పెరుగుతున్న సంఖ్య ప్రకారం వంట ఏర్పాట్లను పర్యవేక్షించిన శ్రీ ప్రభాకర్‌గారికి, రమేష్ గారికి, సహాయ సహకారాలు అందించిన నాటి మహిళా గురు బంధువులు నాటి అన్నపూర్ణలే అనుటలో అతిశయోక్తి లేదు.

కార్యక్రమాలు జరిగినన్ని రోజులు కేవలం గురుబంధువులే కాక షిర్డిలో బాబా దర్శనం కోసం వచ్చిన భక్తులు అనేకమంది ఈ కార్యక్రమాలు తెలిసి గురుదర్శనం కోసం రావటం ఒక విశేషం.

9,10,11,12 తేదీల నాలుగురోజులు నాలుగు చెరుగుల నుండి గురుబంధువులు వస్తూనేవుండగా వారందరికీ వసతి సదుపాయములు వారివారి కోరిక ప్రకారం వారికి షిర్డీ లాంటి క్షేత్రంలో, అందులోను రద్దీ టైములో సమకూర్చే కార్యభారాన్ని స్వీకరించిన గురు బంధువులు అభినందనీయులు.

బాబా నామంతో బాబా పదములను తాకిన షిర్డీ గ్రామంలో సాయిపథం ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేసుకుంటు సమాధి దర్శనం చేయటం కొసమెరుపు.

## గురుస్మృతులు

గురుసన్నిధి :

గురువుగారి దర్శనం పండుగ మూడురోజులు మాత్రమే ఉంటుందని ఊహించాం. కానీ ఆ భాగ్యం ముందుగానే లభించినందుకు పొంగిపోయాం. అయితే పాద నమస్కారం కోసం ఆరాటపడిన భక్తజనం గురువుగారి చుట్టూ మూగి అడ్డం రావటంతో వారు వేదికపై వచ్చిన తరువాత మాత్రమే, కొద్ది సమయం వారి దర్శన భాగ్యం మాకు లభించింది. "గురు సన్నిధిలో ఎక్కువసేపు గడిపే భాగ్యం లేకపోయిందే" అనుకుంటున్నాకు ఆ కోరిక మరోవిధంగా ఫలించింది. విజయదశమి రోజు నుండి రెండు పూటలా ఎక్కువసేపు వారిని చూస్తూ గురుసన్నిధిలో గడిపే అవకాశం మాకు గురుదేవులు కల్గించారు. ఆ విధంగా వారి సన్నిధిలో గడిపినందువలన కలుగుతున్న ఆనందాన్ని దూరం చేసుకోలేక ఏ రోజుకారోజు ప్రయాణం వాయిదావేసుకుంటూ దశమి తరువాత కూడ అదనంగా నాలుగురోజులు వారి సన్నిధిలో గడిపి అమితానందాన్ని అనుభవించాం.

సి.హెచ్.లక్ష్మీనారాయణ.

## గురుస్మృతులు

### మన గురువు

ఓం శ్రీ సాయినాథాయ నమః

నేను భక్తుడుగా కొన్నాళ్ళు, హేతువాదిగా కొన్నాళ్ళు, నాస్తికుడుగా మరికొన్నాళ్ళు గడిపి ఆపై పోషిస్తు భావాలు కలిగి కమ్యూనిజం గురించి తెలుసుకొని ఈ లోకంలో ప్రజలంతా సుఖశాంతులతో వర్థిల్లాలని భావించి నా వంతు కర్తవ్యం నిర్వర్తించాను. ఏ పార్టీలో చేరకపోయినా కమ్యునిస్టు సానుభూతి పరుడుగా ఉండి అనేక కార్యక్రమాల్లో పాల్గొని అందులో కూడా సంతృప్తి లేక అనేక దుస్సంఘటనలు ఎందురై వాటిని తట్టుకొని చివరి వరకు నా పరిధిలో పోరాడినాను. కానీ అందులో విసిగి వేసారి, విరక్తి చెంది కొన్నాళ్ళు దూరంగా పల్లెటూరులో వున్నాను. అక్కడి నుండి మళ్ళీ మామూలు జీవితాన్ని ఆరంభించి నా పాత వాసనలు నన్ను వదలక పోవటంతో మళ్ళీ వ్యాపారంలో దెబ్బలు తిన్నాను. ఇది నా పాత కథ.

నేను శిరిడీకి ఈ మధ్య శ్రీ శరద్బాబూజీ పుట్టినరోజు, బాబా సమాధి చెందిన రోజు మరియు విజయదశమి ఉత్సవ వేడుకలకు వెళ్ళాను. శరద్బాబూజీ గారు మాట్లాడితే వారి

గొంతు రికార్డింగ్ చేద్దామని నా మిత్రులు గట్టారత్తయ్యగారు నన్ను శిరిడీకి తీసుకువెళ్ళారు. నేను 12 రోజులు సాయిపథ ఆశ్రమంలో గడిపాను. నేను జీవితంలో శ్రీ శరత్ బాబూజీగారి వంటి గురువును చూడలేదు. ఆ నిరాడంబరత, అందరి ఎడల ప్రేమ ఆశ్చర్యకరం. ఉన్నవారు, లేనివారు అనే బేధం లేకుండా అందరిని ఓ కంటకనిపెడుతూ, ఎవరికి ఏ అనుభూతి ఇవ్వాలో అది ఇస్తూవారిని నిత్యం సాయిపథగాములుగా తీర్చిదిద్దుతున్న బాబా దివ్యశక్తియే శ్రీశరద్బాబూజీ అని నా దృఢ నమ్మకం.

గురుబంధువులు శరద్బాబూజీ తో ఓరోజు సత్సంగం జరిపినప్పుడు నన్ను అందరికంటే చివరిగా పిలిపించి నా చేత అనేక ప్రశ్నలు వేయించి గురుబంధువులను, నన్ను ఆశ్చర్యచకితులను చేసారు. ఇదే నా తొలిమెట్టు సాయిపథానికి నేను శరత్ బాబాగారిని కోరింది ఏమంటే నా బాధలు తీరాలని నాతో పాటు నాలాగా బాధపడే వారందరిని ఆదుకొమ్మని. శ్రీ సాయిబాబా చరిత్ర మనం గమనించినట్లైతే బాబా అందరి ఎడల ఒకేరకమైన ప్రేమ చూపారు. ఆయన మాటల్లో చెప్పాలంటే సర్వమతాలు ఒక్కటే, 'సర్వజీవులను ప్రేమించండి, ఏ జీవి ఆకలితో వచ్చినా నీకున్నదాంట్లోనే ఆ జీవికి ఆకలి తీర్చు' అన్నారు బాబా. ఆ మాటలే నన్ను బాబా భక్తునిగా సాయిపథగామిగా తీర్చిదిద్దాయి.

అవే మాటలు శ్రీ శరద్బాబూజీ నోట విన్నాను. శ్రీ శరత్ బాబూజీ చెప్పిన మాటలు ఏమంటే 'నిజమైన సోషలిస్టు కమ్యూనిస్టు శ్రీసాయిబాబాయే' అని, ఆ మాటలు నిజం కాదని ఎవరైనా అనగలరా! శ్రీ సాయి బాబా, చూపులకు ముస్లిం, చెప్పే మాటలు, చేతలు హిందూ, ఒకసారి దేహం విడచి తిరిగి మూడు రోజుల తరువాత బ్రతకడం ద్వారా క్రిస్టియన్‌గా మనకు చరిత్ర చెబుతున్నది.

లోకంలో ఏ సద్గురువుకు లేని శక్తి శ్రీ శిరిడి సాయి బాబాకు ఉన్నదంటే అది అతిశయోక్తి కాదు. మరి అలాంటి బాబా అనుగ్రహం సంపాదించి శిరిడీలో ఎందరో ఆర్తులను ఆదుకొంటున్న వ్యక్తి సాయిశక్తియైన శ్రీ శరద్బాబూజీ. మొన్న జరిగిన సత్సంగ వేడుకల్లో ఎందరో గురుబంధువులు వారి వారి అనుభవాలను చెబుతుంటే నాకు ఆనందంవేసింది. నాలాంటి ఆర్తులు ఎందరో వున్నారు, వారినందరిని ఆదుకొనే శక్తి ఈనాడు శిరిడీలో శ్రీశరద్బాబూజీ గా ఉంది అని ఎంతో ఆనందపడ్డాను, కాని అక్కడ నుండి శరద్బాబూజీ గారి ఆశీస్సులు లభించిన తరువాత నేను నా బాధల నుండి ఉపశమనం పొందాను. బాధలు ఎక్కువ కాకుండా నిత్యం నన్ను కాపాడుతున్న కలియుగ శక్తి శ్రీశరద్బాబూజీ. పెద్ద ఊబిలో ఇరుక్కున్న నన్ను తన అభయహస్తంతో పైకి లాగుతున్న బాబా వరప్రసాదం శ్రీశరద్బాబూజీ. చివరిగా గురుబంధువులను నేను కోరేదేమంటే కేవలం మన కోర్కెలు తీర్చుకోవటమే కాదు, ప్రజలందరి కోర్కెలు తీరాలి, వారి బాధల్లో పాలు పంచుకొని వారినందరిని సాయిపథగాములుగా తీర్చిదిద్దాలి. మనందరి బాధ్యతను వహిస్తున్న

శ్రీ శరద్బాబూజీ ఆ"శ్రమ"పథము వైపు ఆ శిరిడీ మళ్ళించి పవిత్ర శిరిడి సాయి సన్నిధిలో మన మంతా సేదతీరాలని కోరుకుంటున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు

సి.హెచ్.సాంబశివరావు.

## అనుభవంలోకి వచ్చిన నిజం

గురుకృపకి దసరా ఉత్సవ అనుభవాలు వ్రాయమని కోరారు. దసరా అనుభవాల కంటే ముందున్న పరిస్థితిని తెలియజేయాల్సిన అవసరం ఉంది. అందరికిలాగానే మాకూ పాత దేవుళ్ళు - కొత్త దేవుళ్ళ సమస్య వచ్చింది. గతం నుండి మావారు వెంటనే మారగలిగారు గాని నాకు మాత్రం కొంత సమయం పట్టింది. కొంతకాలం రెండుచోట్ల పూజలు చేయటం, వివిధ సత్సంగాలలో పాల్గొనటం జరిగింది. ఇప్పుడు మాత్రం ఒకే దైవం - ఒకే ధ్యానం - ఒకే ధ్యేయంతో బాబానే పూర్తిగా నమ్మకొని, గురు దేవులు శరద్బాబూజీ బాటలో పయనిస్తూ, తరచూ వారిని దర్శించుకుంటూ తరిస్తున్నాను.

గురుబంధువులు వారి అనుభవాలు చెపుతూ గురువు గారిని దర్శించినపుడు మాకు ఏడుపు వచ్చింది, అలా ఉంది - ఇలా ఉంది అని రకరకాలుగా చెబుతుంటే నాకు గమ్మత్తుగా ఉండేది. ఏడుపు రావటం ఏమిటి? అని అనుకునే దాన్ని. దసరా నాలుగు రోజులు, రెండు పూటలా గురుబంధువులతో కలిసి గురువుగారి దర్శనం చేసుకునే మహదవకాశం లభించింది. చివరి రోజు గురువు గారితో వెళ్ళివస్తాను అని చెబుతూ వారివైపు చూడలేక కళ్ళనీళ్ళ పర్యంతము దిగమింగుకొని శెలవు తీసుకుని బైటకు రావటం జరిగింది. బస్టాండ్ కు వెళుతూ కూడా ఏదో ఆవేదన. ఆ పరిస్థితినుండి బయట పడటానికి చాలాసేపు పట్టింది. అలానాకు అనుభవంలోకి వస్తేగానీ నిజం ఎలావుంటుందో తెలియలేదు

జి.సుజాత - తెనాలి

## గురుస్మృతులు

గురుదేవుల పిలుపు అందినవేళ

మేము శిరిడి వెళ్ళడం కూడా గురుదేవుల ఆశీస్సులవల్లే. శిరిడి వెళ్ళినప్పటినుండి గురుదేవుల దృష్టిలో నేను వున్నానో లేనో అనే తపన బయలు దేరింది. ఆ మహానుభావుడు దృష్టి అందరి మీద వుంది. కాని వెధవ ఆలోచన - నన్ను లోపల వేధించేస్తోంది. నా ఈ కోరిక మూడో రోజున తీరింది. డయాస్ మీద నుండి దిగి లోపలకి వెళ్ళి పోతూ, గురుదేవులు నా ముందుకొచ్చి నవ్వడమనేది మరచిపోలేని అనుభూతి. అంతటితో తృప్తి

పడని జన్మ నాది. గురుదేవులతో పిడిగా మాట్లాడాలనే కోరిక వేధించటం మొదలయ్యింది. కనీసం తిరుగు ప్రయాణం రోజైనా గురుదేవులతో మాట్లాడలేక పోతానా అనే ఆశతోనే వున్నాను. నేను బయలుదేరే రోజు గురుదేవులు డయాస్ మీదకే వచ్చారు. ఇక నా బాధ వర్ణనాతీతం, నా కోరిక తీరదేమోనని అందరూ వెళ్ళి వరుసగా నమస్కారం చేసుకుంటున్నారు. నా వంతు వచ్చింది. మనస్సులోనే ఎందుకయ్యా ఇలా బాధపెడు తున్నారు", అనుకుంటూ నమస్కారం చేసుకొని వచ్చి కూర్చున్నాను. గురుదేవులు స్టేజి దిగి వెళ్ళారు. నాకు ఏడుపొచ్చేస్తోంది. ఏమి చేయాలో తోచని పరిస్థితిలో నాదగ్గరకు సాయి ప్రసాదు గారి అబ్బాయి వచ్చి "మిమ్మల్ని గురుదేవులు పిలుస్తున్నారు" అన్నాడు, అంతే నేను మా పాప చెయ్యిపట్టుకుని ఎలా ఆ దేముడి గదిలోకి వెళ్ళానో నాకే తెలియదు. చెప్పలేని ఆనందం, నా ఆవేదన, బాధ ఆ దేముడు తన దగ్గర 40 నిమిషాలు కూర్చోపెట్టుకుని తీర్చేసారు. అంతేకాదు మా పాప గురుదేవుల దగ్గర ఆశ్రమంలో ఉండాలని అనుకుంది, ద్వారకామాయిలో, గురుస్థాన్ లో పారాయణ చేసింది. గురుదేవులు ఉండరు నువ్వు అలా కోరుకోవద్దన్నా మా పాప వినలేదు. తను పడే ఆవేదన తను పడుతోంది, లోపల్లోపల కుళ్ళి పోతుంది. గురుదేవుల గదిలోకి వెళ్ళినప్పుడు నేను నమస్కారం చేసేటప్పుడు తను గురుదేవుల్ని చూడలేక దిక్కులు చూస్తూ నుంచున్నది. ఆ దేముడికి తెలియందేముంది. స్వామి తనని "ఏమిటిరా" అని పలకరించారు. అంతే ఒక్కసారి బావురుమంది స్వామి ఒడిలో తలపెట్టి అప్పుడు వారిద్దరి సంభాషణ విన్న నాకు ఏడుపాగలేదు. మా అమ్మ నన్ను శిరిడి పంపదని మా పాప "పంపిస్తుందిగా" అని గురుదేవులు "అమ్మ తీసుకురావడం లేదు" అని మా పాప, "అమ్మతోనే వద్దువు సరేనా" అని గురుదేవులు మీ దగ్గరే వుంటానని" మా పాప, "నా దగ్గరే వుందువు సరేనా" అని ఎంతో ఆప్యాయయంగా గురువుగారు వారిరువురి సంభాషణ వింటుంటే ఇక దుఃఖ మాగుతుందా! చెప్పలేని ఆనందం అంతేకాదు గురుదేవులు దృష్టిలో నేనున్నానా అనే అనుమానం పటాపంచలయ్యింది. ఆ గురుదేవుడి కరుణ, ప్రేమ ప్రతి ఒక్కరి మీద వుంటుందని అర్థం చేసుకోలేని మూర్ఖురాలినే" అని బాధపడ్డాను.

జై శరత్ గురు సాయినాథ్ మహరాజ్

పి. విజయలక్ష్మి, తెనాలి.

సాయిపథం నుండి

## దాసగణుకు బాబా శిక్ష(ణ)!

తనకు శ్రేయోదాయకమని నమ్మిన మార్గాన్ని తన సాటివారికి కూడా తెలిపి, వారూ ఆ మార్గంలో పయనించాలని తపాతపలాడటం మానవనైజం. ఈ మానవ నైజమే సాయిభక్తులలో కూడా ప్రకటితంకావడం సహజం. శ్రీసాయిని ఆరాధిస్తూ, సాయి లీలలు చవి చూచిన సాయి భక్తులు, శ్రీ సాయి అనుగ్రహం అందరి మీదా వర్షించాలని కోరుకుంటారు. ఈ దృష్ట్యా ప్రతి సాయి భక్తుడు సాయి సేవకుడే. సాయితత్వ ప్రచారకుడే.

కొందరు తెలిసి ప్రయత్న పూర్వకంగా యీ సేవలో నిమగ్నులైతే, కొందరు తమ తమ అనుభవాలను తమ తోటివారితో పంచుకోవడం ద్వారా తమకు తెలియకుండానే సాయి ప్రచారమనే సేవ చేస్తున్నారు. తమ తమ శక్త్యానుసారం వారు చేస్తున్న యీ సేవలో, శక్తి సామర్థ్యాల తారతమ్యాన్ని బట్టి ఫలితాల పరిణామం వుండటం సహజమే! కానీ, భగవంతుడు స్వీకరించేది, ఆ సేవ వెనుక వున్న వారి భక్తినిగానీ, స్థూలకర్మను పరిమాణాన్ని కాదు! వారధి నిర్మాణంలో హనుమంతుడు మొ|| వానర వీరులు చేసిన సేవ ఎంతో, ఒక ఉడుత తన శక్త్యానుసారం చేసిన సేవ శ్రీరామునికంతే ప్రియమైనదని చెప్పే 'ఉడుతాభక్తి' కథ యీ సత్యాన్నే బోధిస్తున్నది.

అయితే, భగవత్సేవ, ధర్మ ప్రచారంలో దీక్షగా పాల్గొనే కొందరికి, క్రమేణా తామే నిజమైన ప్రచారకులమనీ, మిగిలిన వారి సేవ 'బూటకమ'నే భావం కలిగి సాటి సాయి సేవకులపై అసూయా ద్వేషాలు పెంచుకోవడమూ మానవ సహజమే. ఈ పరిణామం చివరకు వీరిని అధోగతి పాలుచేయక మానదు. ఆ పతనాన్నుండి ఏదో విధంగా హెచ్చరించి కాపాడగలవాడు శ్రీసాయి వంటి సద్గురువొక్కడే.

ఇటువంటి సమస్యే ఒకసారి శ్రీ దాసగణుకొచ్చింది. వేలాది మందికి తన (సంకీర్తనల ద్వారా) బాబాను గూర్చి తెలియచేస్తూ ప్రముఖ సాయిభక్తి ప్రచారకుడుగా పేరు పొందిన శ్రీదాసగణుకు శిరిడీలోని మరో ప్రముఖ సాయి భక్తుడంటే పడేదికాదు. ఆ సాయిభక్తుడు తనకు తోచిన పంథాలో బాబా మహిమను గూర్చి తెలియజేస్తూ, సంఘంలో(ఆర్థికంగా, రాజకీయంగా) ఎంతో పలుకుబడిగల ఎందరో ప్రముఖులకు బాబాను గూర్చి తెలిపి, వారు సాయిభక్తులయ్యేందుకు నిమిత్తమాత్రుడయ్యాడు. ఆ సాయిభక్తుని పంథా గురించి దాసగణు ఎప్పుడూ అందరితోను విమర్శిస్తుండేవాడు. సహజంగానే ఆయన మాట తీరు చాల పరుషంగా వుండేది. ఒకసారి శిరిడీలో ఆ సాయి భక్తునితో, చాలా పరుషంగా మాట్లాడి దూషించాడు. వెంటనే బాబా దాసగణుని పిలిచి, హరిదాసుకు అహంభావం కూడదని గట్టిగా మందలించి, వెంటనే వెళ్ళి తాను దూషించిన ఆ సాయిభక్తుని కాళ్ళుపట్టుకొని క్షమాపణ వేడుకొనమని ఆదేశించారు. ఎందరికో 'గురువు' గా ప్రఖ్యాత సంకీర్తనకారునిగా పేరున్న దాసగణుకు అది చిన్న శిక్షేమీ కాదు! కానీ, శ్రీదాసగణు తనతప్పును గ్రహించి, బాబా ఆదేశాన్ని వెంటనే అక్షరాల అమలుచేశారు. ఆనాటి నుండి దాసగణు తన శక్తికొలది వినమ్రతను అలవర్చుకొన్నాడు.

ఈపై ఆర్టికల్ ఫిబ్రవరి 1989 "సాయిపథం"లో శిక్ష(ణ) అనేది ఏలా వుంటది. బాబా ఆ రోజులలో ఈర్ష్య, అసూయా ద్వేషాలను ఎలా తొలగించినది మనకు గురుదేవులు చక్కగా వివరించారు. మరియింత శ్రద్ధగా ఈ ఆర్టికల్ చదివిన తరువాత మనము ఏమిటి, మనము ఎలావున్నాము, మన ప్రవర్తనలో ఏమైనా తప్పులున్నవా అని ప్రశ్నించుకొన్న రోజున ఫలానా ఆయన గురువుగారికి అత్యంత సన్నిహితుడు అనికాని, అరె ఈయన నిన్నకాక మొన్న వచ్చాడు

ఏమిటి మనకు నేర్పుతున్నాడు అనికాని, నేను యిన్ని రోజులనుండి బాబా గురించి ప్రచారసేవ చేస్తున్నాను నాకు లభించనిది యింకొకరికి ఎటువంటి సేవచేయకుండానే గురుకృప కలిగిందను చింతనలకు తావులేదు. అదే నిజమయిన సాయి బాట.

సాయిపథం నుండి.........

## నాదృష్టిలో గురువు

గురువనే పదాన్ని 99 శాతము మంది ఉపయోగిస్తూనే ఉంటారు. అయితే, అందరూ ఒకే రకమైన భావనతో, ఒకే రకమైన ఉద్దేశ్యంతో మాత్రం అనరు. అక్కడ వారి భావాలే వారి వారి వ్యక్తిగతాలు. అందుకని నా భావాలే గురు శబ్ద విషయంలో ఎదుటివారు ప్రకటితమయ్యేలా మాట్లాడాలని గాని, వ్రాయాలని గాని, అంటే అది అవివేకమే అవుతుంది. ఈ పరిమితిని దృష్టిలో వుంచుకొని, నా దృష్టిలో గురువు అంటే ఎవరో, గురు లక్షణాలేమిటో నన్నవిషయాన్ని గురువనుగ్రహంతో నా మందబుద్ధికి తెలిసినంతవరకు వివరించెదను.

1. లోకంలో శక్తులు, సిద్ధులు, అద్భుతమైన చర్యలు, చేసి చూపే వారిని కొందరు గురువుగా భావిస్తారు. కాని అలాంటివారు తమను ఆశ్రయించిన ఛాత్రులకు లౌకికానందాన్ని మాత్రమే యీయగలరు. కాని మోక్షానుభవమైన ఆనందాన్ని వారు అనుగ్రహించ లేరు. అయినా అలాంటి వారిని కూడా గురువులుగా భావించేవారు కొందరున్నారు.

2. ప్రతి మనిషికి తెలియకుండానే 7గురు గురువులుంటారు. వీరుకూడా లోకధర్మాన్ననుసరించిన వారే.

3. పైవారు కాకుండా ఈ దిగువనుదహరించబోయే వారిని గూడా ప్రజానీకము ఎక్కువగా "గురువు"లుగా తలుస్తుంటారు.

A జనాకర్షణ చేయువారు, సభాసమ్మోహనము చేయువారు, మంత్ర విద్యను ప్రదర్శించేవారు, గారడీ విద్యలు చేయువారు, భూతవైద్యం మొ|| చమత్కారాలు చూపేవారు ఒక తెగకు చెందిన గురువులు.

B ఔషధ ప్రయోగాలు చేసేవారు, రసయోగ ప్రక్రియలు చేసేవారు, కనికట్టు కౌశలాన్ని ప్రదర్శించే వారు ఒక తెగకు చెందిన గురువులు.

C సాహిత్య, సంగీత, రాగ, తాళ, నృత్య విద్యాదులతోపాటు, మానవ మనుగడకు పాటుపడే భక్తి విద్యను నేర్పేటివారలు ఒక తెగకు చెందిన గురువులు.

D పంచాక్షరీ, దత్తాత్రేయ, శక్తి, బాల మొ|| జప తపాదులైన మంత్ర విద్యను ఉపదేశాదులను ఇచ్చేటి వారలు ఒక తెగకు చెందిన గురువులు.

E వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాన్ని అపేక్షించి, లౌకిక ప్రజ్ఞతో బ్రతికేటి కొందరు ఎదుటివారిని పేరెట్టి పిలవలేక "గురు" అని సంబోధిస్తుంటారు. అలాంటి 'గురూ'లు సరేసరి. 90 శాతము ఇలాంటి వారలను మన నిత్య జీవితములో చూస్తూనే ఉంటాము.

మానవదృష్టికి సర్వసాధారణంగా పైకోవకు చెందిన వాళ్ళలో యేదో ఒకతెగకు చెందిన వారినే 'గురువు' అని సంబోధిస్తుంటారు. అందుకు కారణమేమంటే వీళ్ళే ఎక్కువ శాతము సభ్యసమాజములో పాతుకుపోయి ఉన్నారు కాబట్టి. ఇంతకంటే 'గురువు' భిన్నంగా ఉంటాడని చాలా మందికి తెలియదు. ఉంటారేమోనని ఊహించే ప్రయత్నం కూడా వారు చెయ్యరు. కాని సాధనా పరంగా మున్ముందుకు పోవాలని తపనపడి ఆరాటము చెంది సాధనా మార్గంలో పయనమొంది తన్నుద్ధరించే గురువు లభించిన వాడికి(లేదా) అన్వేషించే వాడికి మాత్రమే పైనుదహరించిన వారంతా 'గురు' శబ్ద వాచ్యులే అని తేలికగా గుర్తించేస్తాడు. అలాంటి వారితో లౌకిక ప్రయోజనాన్ని ఆపేక్షించేవారు మాత్రమే సంబంధం కల్గి వుంటారు.

మరి అలాంటప్పుడు సాధకునికి లభించేటి(లేదా) గుర్తించేటి గురువు ఎలా ఉండాలి(లేదా) ఏ లక్షణాలతో ఉంటాడో గమనిస్తాం!

1. వైరాగ్య భావము కలిగి వుండి, ఎలాంటి లంపటానికి తావీయక ఉదాసీనమైన భావముతో వుండాలి.

2. నిరంతరం ఆధ్యాత్మిక శ్రవణం, భగవన్నామ నిరూపణ పరమార్థాన్ని వివరించాలి. (మనకు బాబాను గూర్చి అన్ని కోణాలలో వివరించ గలిగి వుండాలి).

3. సారసార విచార జ్ఞానంతో తన్నాశ్రయించిన శిష్యులనేకాక జగత్తును ఉద్ధరించ గలిగి వుండాలి.

4. నరం నరంలో నవవిధ భక్తులనే తంత్రులతో కూడిన వీణను శ్రుతి చేసి ఆ భక్తి ప్రభావంతో, ఆధ్యాత్మిక పథం వైపుకు (మనసు సాయిపథం వైపుకు) మళ్ళించి ఉద్ధరించగలిగిన వాడుగా వుండాలి.

5. అంతః కరణములో శుద్ధ బ్రహ్మ జ్ఞానియై వుండి (బాబాను గూర్చిన పూర్తి జ్ఞానం కలిగివుండాలి. బయటకు యోగాచారపరుడైన పరమభాగవతోత్తమునిగా కన్పిస్తూ భగవంతుణ్ణి(సాయిదేవుని) సేవించేటి వాడుగా వుండాలి.

6. భవభయాలనే పెద్దపులి విషయవాసనా రూపమైన దుముకులు దూకుతూ జీవుడనే దూడను, ఈశ్వరుడనే ఆవునుంచి లాక్కొని పోతూవుంది. అలాంటి సమయంలో ఎవరు జ్ఞానమనే ఖడ్గంతో ఆ పెద్దపులిని నరికివేసి దూడను కాపాడి ఆవుతో కలుపుతాడో అతడే నిజంగా నిజమైన బాబా మార్గంలో బాబా సన్నిధానానికి నడిపించగల 'నేత 'యని (గురువని) నా అభిప్రాయము.

7. మాయాజాలములో పడి నానారకాల సంసార తాపాలతో పరితపించే ప్రాణులకు దుఃఖ నివృత్తి చేయగలిగినవాడు, వాసనా రూపమైన ఊబిలో దిగబడి భయంతో కొట్టు మిట్టాడుతున్న ప్రాణి వద్దకు పోయి వానిని ఆ ఊబినుండి బయటపడేయగలవాడు, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి జననమరణ రూపమైన సంసార చక్రబంధం నుండి బయటపడేయగలగినవాడు, తన ఉపదేశ ప్రభావంతో శిష్యునకు ఆత్మ సాక్షాత్కారాన్ని ప్రసాదించేవాడు, ఉపదేశ మాత్రంతోనే సమస్త తాపత్రయాదులను దూరంచేయగలవాడు, వేద శాస్త్రాదులలోని నిగూఢమైన భావాలను శిష్యుని హృదయంలోనికి సులభంగా హత్తుకొనేలా బోధించేవాడు, మహాత్ముల యొక్క అనుభవమే తన రూపంగా కల్గినవాడు.

8. సందేహాలను మొదట మొదలంటా నాశనము గావించి సత్యాన్వేషణలో ధర్మాచరణం వైపుకు ఆదరంగా అంగలారుస్తూ వెళ్ళేవాడు.

9. గురువుకు అతీతశక్తులున్నప్పటికీ వాటినెన్నడూ బాహాటముగా ప్రదర్శించడు. అలా ప్రదర్శించి ఇబ్బందుల పాలై ఇడుములు పడిన మహానుభావులు ఎందరో వున్నారు.

సముద్రంలో కెరటాలవలె అనంతమైనవి గురులక్షణాలు. ఉవ్వెత్తున లేవక సాదాగా సాగిపోయిన కెరటాలవంటి సామాన్య లక్షణాలనే నేనిప్పుడు వివరించాను.

డా || జి. సాయివరప్రసాదరావు,
తెనాలి.

సాయిపథం నుండి........

## శ్రీ సాయిబాబా ఎవరు?

[ఈ ప్రశ్నకు సమాధానంగా శ్రీ సాయిబాబానే వివిధ సందర్భాలలో తమను గూర్చి తాము పలికిన వాక్యాలు.]

* నేనే అల్లాను

* [మీరెవరు?' అని బాబాను అడిగిన ఒక భక్తునితో] నేను నిర్గుణుణ్ణి : నిరంజనుణ్ణి, నాకొక పేరుగానీ, నివాసానికి ఒక చోటనీ లేదు!

* నేనే దైవాన్ని (పర్వర్దిగర్ ను)! నేను శిరిడీలోను సర్వత్రా కుడా వున్నాను

* గంగాపూర్ లోను, పండరిపూరులోను అన్ని ప్రదేశాలలోను నేనే వున్నాను. జగత్తులోని అణువణువులో నేనే వున్నాను.

* ధ్యానంలో నా రూపాన్ని చూసినా, లక్ష్మీనారాయణున్ని చూచినా ఏముంది? అంతా ఒక్కటే!

* గంగకోసం వేరే ఎక్కడికో పోవడమెందుకు? గంగ నా పాదాల నుండే ప్రవహిస్తున్నది.

* ఈ సకల విశ్వం నాలోనే వుంది.

* నా వయస్సు కొన్ని లక్షల సంవత్సరాలు!

* అన్నీ నావే! అందరికి ఇచ్చేది నేనే!

* నా పని ఆశీస్సులివ్వడమే!

--------- సాయిబాబా